
సాక్షి
బాపట్ల
గురువారం । 23 । జనవరి । 2025



ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరం కోటిలింగాల క్షేత్రం లోని మహాకాళేశ్వర సహిత మహాకాళీ ఆలయ ప్రథమ ప్రతిష్టా వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 558.30 అడుగుల వద్ద ఉంది.కుడి కాలువకు 9,567 క్యూసెక్కులు విడుదలవుతోంది.

చెన్నకేశవ స్వామి కళ్యాణం



మాచర్ల : మాచర్ల పాతఊరులోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి నిత్య కళ్యాణ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు వురు దంపతులు పీటలపై కూర్చొన్నారు.

న్యూస్‌రీల్

ఉత్సవ విగ్రహాలు బహూకరణ



పిడుగురాళ్ల : స్థానికంగా ఉన్న శ్రీ సువర్చల ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయంలో సీతా రామలక్ష్మణ ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను బుధవారం బహూకరించారు. పట్టణానికి చెందిన వ్యాపారి పెరుమాళ్ల రాజేష్ వారి ధర్మపత్ని వనజ లక్ష్మీలు సుమారు రూ.4.50 లక్షల వ్యయంతో ఉత్సవ విగ్రహాలను అందించారు. ఈనెల 25వ తేదీన ఆంజనేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రథోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలను బహూకరించడం జరిగిందన్నారు.

నేటి నుంచి మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఉదయం 10.45 గంటలకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.

నరసింహస్వామికి వెండి కిరీటం బహూకరణ



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంగళగిరిలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి భక్తులు వెండి కిరీటాన్ని బుధవారం బహూకరణగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇ.వో. రామకోటిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన రామారావు తన భార్య అన్నపూర్ణ జ్ఞాపకార్థం ఆయన కుమారులు మధుసూధన్, రవికిరణ్‌లతో కలసి 1.300 కిలోల వెండితో, 3 గ్రాముల బంగారుపూతతో చేసిన వెండి కిరీటాన్ని స్వామివారి అలంకరణ నిమిత్తం అందజేశారని తెలియజేశారు. అనంతరం రామారావు కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుంటూరు-గయ ప్రత్యేక రైలు



లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైలు ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు-గయకు ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. నంబర్ 07719 గుంటూరు-గయ ఈ నెల 25న, 07720 గయ-గుంటూరు ఈనెల 27న ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు.

యార్డుకు 90,138 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 90,138 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 87,523 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,000 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,487 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

చీకటి మాటున ఇసుక దోపిడీ..!

- రేషన్ బియ్యం తరలింపు అంటూ నానా హంగామా
- మరోవైపు కృష్ణానది నుంచి యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక
- పగలు మనుషులతో.. రాత్రి భారీ యంత్రాలతో తవ్వకాలు
- ఉచితం పేరుతో కొల్లగొడుతున్న కూటమి నాయకులు

గుంటూరు జిల్లాలో ఇసుక దోపిడీ ఆగడం లేదు. పగలు మనుషులతో తవ్వకాలు సాగిస్తూ.. రాత్రి కాగానే యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. ముఖ్యంగా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్న తెనాలి పరిధి కొల్లిపర మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి మరీ తోడేస్తున్నారు. నదిలో యంత్రాలతో ఇసుకను తీయటం, సాయంత్రం ఆరు గంటల తర్వాత తవ్వకాలను సుప్రీంకోర్టు నిషేధించింది. అక్రమార్కులు ఆ నిషేధాలను బేఖాతర్ చేస్తున్నారు. రేషన్ బియ్యంపై రాష్ట్రమంతా తనిఖీలు చేస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి తెనాలిలోని పీఎండీ వాహనాలను పలుసార్లు పరిశీలించారు. రైతుబజారులోని తగ్గింపు ధరల బియ్యం దుకాణాల్లోనూ ఆకస్మికంగా తనిఖీ చేసి, హడలగొట్టారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దోపిడీని మాత్రం పట్టించుకోవటం లేదు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కొల్లిపర మండలంలో మున్నంగి, బొమ్మువానిపాలెం-14, బొమ్మువానిపాలెం-15లో ఇసుక రీచ్‌లు నడుస్తున్నాయి. వీటిని ప్రైవేటు కంపెనీలు దక్కించుకున్నాయి. కేవలం కూలీల ద్వారా నదిలో ఇసుకను తవ్వించి, సమీపంలోని డంపింగ్ ప్రదేశంలోకి ట్రాక్టర్లలో చేర్చుతున్నారు. అదంతా మొక్కుబడి తంతుగా చేస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత నుంచి అసలు కథ మొదలవుతుంది. రెండు నుంచి నాలుగు ఎక్స్‌వేటర్లు నేరుగా నదిలోకి వెళుతున్నాయి. రాత్రంతా ఇసుకను తోడేస్తున్నారు. యంత్రాలతోనే 30 టన్నుల భారీ వాహనాల్లోకి లోడు చేస్తున్నారు. రాత్రి పూట లోడుతో వెళ్లే వాహనాలు వెళుతుంటే, మరి కొన్ని నది సమీపంలోని డంపింగ్ ప్రదేశంలో అన్‌లోడు చేస్తున్నాయి. ఒకరాత్రి గడిచేసరికి డంపింగ్‌లో ఉన్న ఇసుక మూడు, నాలుగు రెట్లు పెరిగిపోతోంది. పగటిపూట దర్జాగా ఆ ఇసుకను యంత్రాలతోనే వాహనాల్లోకి లోడు చేసి తాపీగా నిర్ణీత ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పగటి పూట వెళ్లే వాహనాలకే వే-బిల్లులు వ్యవహారం ఉంటుంది. రాత్రి పూట ఏ ఆధారం లేకుండా చూస్తున్నారు. గత నెలరోజులుగా జరుగుతున్న తతంగమిది.

ఏ లోడైనా ఒకటే వే బిల్లు..

ప్రభుత్వం నిబంధనలు మేరకు టన్నుకు రూ.250 తీసుకోవాలి. నిర్వాహకులు లోడింగ్ వద్ద ఎటువంటి వేబ్రిడ్జి కాటా లేకుండా ఎక్స్‌వేటరు మిషన్‌కు ఉన్న బకెట్‌తోనే కొలతలు చేస్తున్నారు. 18 టన్నుల లారీకి 11 బకెట్‌లో లోడు చేసి రూ.6,000 వసూలు చేస్తున్నారు. 24 టన్నుల లారీకి 13 బకెట్‌లు పోసి రూ.9,000 తీసుకుంటున్నారు. అదే వాహనంలో మరింత ఇసుక కోరుకున్న వారికి అదనంగా రూ.500 తీసుకుని లోడు చేస్తున్నారు. ఇసుక ఎంత లోడు చేసినా వే బిల్లు మాత్రం 18, 24 టన్నులకు మాత్రమే ఇస్తున్నారు. ఇదంతా పగటి పూట అధికారికంగా జరుగుతున్న దోపిడీ. రాత్రి 10 గంటల తర్వాత నేరుగా నదిలో ఇసుక లోడింగ్ చేసేటప్పుడు మాత్రం 18 టన్నుల లారీకి రూ.7,000, 24 టన్నుల లారీకి రూ.10,000 వసూలు చేస్తున్నారు. కొల్లిపర మండలంలోని మూడు ఇసుక రీచ్‌లు నదిలో సుమారు 2 కి.మీ. లోపలకు ఉన్నాయి. రాత్రివేళల్లో ఇక్కడ యంత్రాలతో ఇసుక తోడేస్తున్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరూ రాకుండా నిర్వాహకులు అడుగడుగునా కాపలా ఉంచి మరీ పని కానిస్తున్నారు. కొత్త వ్యక్తులు ఎవరు అటుగా వెళ్లినా తరిమేస్తున్నారు. ఎవరూ అటు వెళ్లే సాహసం కూడా చేయటం లేదు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

మంత్రి నాదెండ్ల ఇలాకాలో ఆగని ఇసుక అక్రమ రవాణా



పగటి పూట మనుషులతో లోడింగ్ చేయిస్తున్న అక్రమార్కులు



రాత్రివేళ యంత్రాలతో లోడింగ్ చేస్తున్న దృశ్యం

నిబంధనలకు 'మంగళ'ం

మంగళగిరి నియోజకవర్గంలోని గుండిమెడలో కూడా ఇదే తంతు నడుస్తోంది. గ్రామస్థాయి నాయకులు ఉచిత ఇసుక పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదిలో తవ్వకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం కృష్ణానదికి మూడు కిలోమీటర్ల లోపు ఉన్న ప్రాంతాల వారు సచివాలయం అనుమతితో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని సూచించింది. కానీ 30 కిలోమీటర్ల వరకు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసేస్తున్నారు. జిల్లాలోని రాయపూడి, ఉద్దండరాయపాలెం, ప్రాతూరు, చిర్రావూరు, రామచంద్రాపురం, కొండూరు, తెనాలి నియోజవర్గంలోని పలు ఇసుక రీచ్‌ల నుంచి ఉచిత ఇసుక పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు. కూటమి నేతల ధనదాహానికి కృష్ణానదిలో నిబంధనలకు విరుద్ధంగా 10 మీటర్ల లోతు పెట్టి మరీ ఈ ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందని పర్యావరణవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా జిల్లాలో 17 ఎకరాల పట్టా భూముల్లో, 4.93 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాలకు జిల్లా యంత్రాంగం అనుమతులు జారీ చేసింది. మరో 70 ఎకరాల్లో ఇసుక తవ్వకాల కోసం వచ్చిన దరఖాస్తులకు కూడా త్వరలో ఆమోద ముద్ర వేయనున్నారు.

ప్రగతి చాటేలా గణతంత్ర దిన వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: ప్రగతిని చాటి చెప్పేలా జాతీయ పండుగను అధికారులు ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. గణతంత్ర దినోత్సవం నిర్వహణపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో సంక్షేమ పథకాలు అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా 18 స్టాల్స్ ఏర్పాటుకు ఆదేశించారు. అదే రీతిలో కనీసం 12 శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. వేడుకలకు వేదికైన పోలీస్ కవాతు మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గ్యాలరీలు, బ్యారికేడ్లు, పార్కింగ్, తాగునీరు వంటి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని తెలిపారు. వరదల సమయంలో కష్టపడి పనిచేసిన అధికారులు, ఉద్యోగులకు అవార్డుల ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని శాఖలలో అర్హులైన ఉద్యోగులను గుర్తించి 23వ తేదీ సాయంత్రంలోగా కలెక్టరేట్‌కు జాబితా పంపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గృహాల సర్వేలో పేర్లు నమోదు చేయించుకోవాలి: కలెక్టర్

బాపట్ల: గృహాల సర్వేలో మిగిలిపోయిన వారంతా సచివాలయాలలో తక్షణమే తమ పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఇల్లు జియో ట్యాగ్ చేపించుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ కార్డులు లేని వారు తక్షణమే ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

- ఎస్సీ కార్యకర్త సురేష్‌ను అంతమొందించేందుకు టీడీపీ నేతల యత్నాలు
- కొందరు వ్యక్తులను సుపారీకి నియమించుకున్న వైనం
- తీవ్రగాయాలపాలైన సురేష్.. ఆస్పత్రికి తరలింపు
- అమర్తలూరు మండలం ప్యాపర్రులో ఘటన



తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో సురేష్‌ను పరామర్శిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): మండలంలోని ప్యాపర్రు గ్రామానికి చెందిన ఎస్సీ నాయకుడు, వైఎస్సార్ సీపీ కార్యకర్త మూట సురేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే ప్యాపర్రు గ్రామంలో రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్‌లో సురేష్ ఉద్యోగం చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతణ్ణి ఉద్యోగం నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయమై గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, తెలుగుదేశం నాయకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో టీడీపీ నాయకులు సురేష్‌పై దాడి చేసేందుకు కొందరు వ్యక్తులను సుపారీకి నియమించుకున్నారు. ఈక్రమంలో ప్లాంట్‌లో విధుల్లో ఉన్న సురేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగిందని ఎస్‌ఐ అమర్‌వర్ధన్ బుధవారం తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై, సహకరించిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి – వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి నాయకుల కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కూటమి నేతల ప్రోద్బలంతో తీవ్రంగా గాయపడి తెనాలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.సురేష్‌ను బుధవారం అశోక్‌బాబు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్‌పై హత్యయత్నానికి పాల్పడిన దుండగులను గుర్తించి వారిని ప్రోత్సహించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. శాంతియుతంగా ఉన్న గ్రామాల్లో కూటమి నేతలు అలజడులు సృష్టిస్తూ, హత్యాయత్నాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చర్యలపై పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన పని లేదన్నారు. ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

దాడులను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం



తెనాలి ప్రభుత్వం వైద్య శాలలో సురేష్‌ను పరామర్శించిన మేరుగ నాగార్జున

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. టీడీపీ నేతలు చేయించిన దాడుల్లో తీవ్రంగా గాయపడి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తను సురేష్‌ను బుధవారం మేరుగ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత జిల్లాలో కూటమి నాయకుల దాడులు పెచ్చురిల్లాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యక్తలను టార్గెట్ చేసి దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, వారిపై ప్రైవేటు కేసులు వేసేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, కార్యక్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సురేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట చందోలు డేవిడ్ విజయకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గోటిపాటి హేమ చంద్ర శ్రీనివాసరావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఐదు కేంద్రాల్లో సజావుగా నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన సిబ్బంది
- గుంటూరులోని ఒక పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులతో దురుసు ప్రవర్తన
- విద్యార్థుల వెంట వెళ్లిన తల్లిదండ్రులపైనా అనుచిత వ్యాఖ్యలు
- ఫొటోలు తీస్తున్న మీడియా ఫొటోగ్రాఫర్లతోనూ అదే తీరు

గుంటూరు ఎడ్యుకేషన్ : దేశ అత్యున్నత విద్యాసంస్థలో సీటు సాధించడమే ధ్యేయంగా విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు బుధవారం హాజరయ్యారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2025 మొదటి సెషన్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు విద్యార్థులు హాజరయ్యారు. బీఈ, బీటెక్ కోర్సుల్లోకి ప్రవేశాలకు ఉద్దేశించిన ఈ పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి. 30న మధ్యాహ్నం పేపర్-2 బీఆర్క్ పరీక్ష జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దీనికోసం గుంటూరులో మూడు, పల్నాడు జిల్లాలో రెండు చొప్పున ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాటు చేసిన కేంద్రాల పరిధిలో పరీక్షలు జరిగాయి. మొత్తమ్మీద దాదాపు 10 వేల మందికిపైగా విద్యార్థులు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గుంటూరు శివారు నల్లపాడులోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రం వద్ద సిబ్బంది మాత్రం దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల వెంట వెళ్లిన తల్లిదండ్రులను పరీక్షా కేంద్రం సమీపంలో ఎక్కడా వేచి ఉండరాదని హెచ్చరించారు. ఉదయం 9 గంటల పరీక్షకు 7 గంటలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని ఎన్‌టీఏ నిర్దేశించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. నల్లపాడు పరీక్షా కేంద్రం వద్ద పరీక్షల రాసి బయటకు వస్తున్న విద్యార్థులను ఫొటోలు తీసేందుకు వెళ్లిన మీడియా ఫొటోగ్రాఫర్లపై అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. ఎందుకు వచ్చారని పేర్కొనడం గమనార్హం.



ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులను విలీనం చేస్తూ గత ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబరు 117ను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో బుధవారం గోరంట్లలోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులతో అంతర్గతంగా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 3, 4, 5వ తరగతులను గతంలో మాదిరిగా ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణపై చర్చించారు. గ్రామ స్థాయిలో ఐదు తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్జేడీతోపాటు మూడు జిల్లాల డీఈవోలు, ఎంఈవోలకు డైరెక్టర్ సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఐదు తరగతులకు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను మూసి వేయడమే మేలని, ఇకపై వాటి స్థానంలో ఐదో తరగతి వరకు ప్రాథమిక, ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు ఉన్నత పాఠశాలలే ఉండాలని డైరెక్టర్ స్పష్టం చేశారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి

రేపల్లె రూరల్: క్షణికావేశంలో చేసే తప్పిదాలతో జీవితాలు నాశనమయ్యే అవకాశం ఉంటుందని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. పట్టణంలోని సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇక నుంచైనా ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విరామ సమయంలో పుస్తక పఠనం అలవరుచుకోవాలని పేర్కొన్నారు. సమాజంలో జీవించేందుకు అవసరమైన వృత్తులపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేరం ఆరోపించబడి రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ప్రభుత్వపరంగా న్యాయ సేవలు పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు. ప్రైవేటు న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చన్నారు. న్యాయ సేవా చట్టాలను వివరించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సదస్సులో సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, న్యాయవాదులు కొత్తపల్లి శ్రీవాణి, కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వరికూటి



వేమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి బొకే అందజేసి, దుశ్శాలువాతో సన్మానించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

26న ఉమ్మడి గుంటూరు ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని జె.పంగలూరులో మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలను ఫిబ్రవరి 7,8,9 తేదీలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య బుధవారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పురుషుల, మహిళల ఖోఖో జట్ల ఎంపికకు గాను ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుంచి నకరికల్లులోని ఉన్నత పాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనేందుకు వయోపరిమితి లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆసక్తిగలవారు ఎవరైనా సెలక్షన్స్‌కు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9866925108 నంబరులో సంప్రదించాలని సూచించారు.

యువతిపై లైంగిక దాడి

ఇద్దరిపై కేసు నమోదు

మాచవరం: స్నేహంగా ఉంటూ ఫొటోలు దిగి.. ఆపై ఆ ఫొటోలు అడ్డంపెట్టుకుని యువతిని బెదిరించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన యువతికి గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు పరిచయం అయ్యాడు. పరిచయం స్నేహంగా మారి స్నేహపూర్వకంగా ఫొటోలు దిగారు. యువతికి ఇటీవల వివాహం కుదరడంతో, తనతో దిగిన ఫొటోలు ఇవ్వమని యువకుణ్ని అడిగింది. గతేడాది డిసెంబర్ 12న తెలంగాణలోని నల్గొండ జిల్లా దేవరకొండ వస్తే ఇస్తానని నమ్మ బలికాడు. ఆపై తన కోరిక తీరిస్తేనే ఫొటోలు ఇస్తానని చెప్పి బెదిరించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఘటనపై బాధిత యువతి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువకునితో పాటు, ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరించిన మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

మాతృమరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం జిల్లాలో మాతృమరణాలపై కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదపరిమి గ్రామంలో డిసెంబర్ నెలలో జరిగిన ఒక మాతృమరణానికి గల కారణాలను కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ మరణం గర్భస్థ కారణాల వల్ల జరిగింది కాదని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిపోల నిర్మాణానికి చొరవ చూపాలి

నెల్లూరు డివిజన్ ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వరరావు



ఇంకొల్లు బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఈ వెంకటేశ్వరరావు

ఇంకొల్లు (చినగంజాం): బస్ డిపోల నిర్మాణం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని నెల్లూరు డివిజన్ ఆర్టీసీ ఈఈ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఇంకొల్లులోని బస్టాండ్‌లో నిర్వహిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ల అభివృద్ధి, డిపోల నిర్మాణం వంటి అంశాలు.. డిపో మేనేజర్, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషితో సఫలమవుతాయని తెలిపారు. అనంతరం ఒంగోలు ఆర్టీసీ డీఈ వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బస్టాండ్‌లో పెండింగ్‌లో ఉన్న ప్యాచ్‌వర్క్‌లు వేగవంతంగా పూర్తి చేసి సున్నం వేయించాలని అధికారులకు సూచించారు. బస్టాండ్ ముందువైపు సీసీ రోడ్డు నిర్మాణపు పనులను 2025–26 బడ్జెట్‌లో డిపో మేనేజర్ నుంచి తమకు ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేసి వెంటనే పూర్తి చేస్తామని తెలిపారు. బస్టాండ్‌లో జరుగుతున్న మరమ్మతులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఒంగోలు ఆర్టీసీ డీఈ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ నరసయ్య, మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు ఎ. మోహనకృష్ణ, కంట్రోలర్ బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

మహారాష్ట్ర వ్యవసాయ ఉన్నతాధికారుల బృందం రాక



ఎరుకలపూడిలో మొక్కజొన్న పొలంలో మహారాష్ట్ర బృందం

తెనాలి: మహారాష్ట్ర నుంచి వ్యవసాయ ఉన్నతాధికారుల బృందం బుధవారం జిల్లాలోని వివిధ ప్రదేశాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. మహారాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ అండర్ సెక్రటరీ–14ఎ ప్రశాంత్ పింపుల్(ముంబయి), వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి దత్తాత్రే గోసానే(పూనే), జిల్లా వ్యవసాయ సూపరింటెండెంట్ రవీంద్ర మానే(ధారశివ్), సీనియర్ కన్సల్టెంట్ సలీల్ కుమార్ జైన్, కన్సల్టెంట్ నేహా పాటిల్ బృందం, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారితో కలసి తెనాలి రూరల్ మండల గ్రామం ఎరుకలపూడిలో పర్యటించారు. ఆ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం రైతులు విజయలక్ష్మి, రంగయ్యతో కలసి సాగు చేస్తున్న మొక్కజొన్న పైరును పరిశీలించారు. ఆ పొలం గట్లపై వివిధ రకాల జీవ వైవిధ్య పంటలను, నిరంతర ఆదాయాన్ని సమకూర్చే 'ఎనీ టైం మనీ' మోడల్‌ను ఆసక్తిగా పరిశీలించారు. ప్రకృతి సాగులో అవలంబిస్తున్న విధానాలు, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగులో ఉన్న మొక్కజొన్న చేనుతోపాటు సమీపంలో రసాయన ఎరువులు, పురుగుమందులతో పండిస్తున్న మొక్కజొన్న పైరును, వేరు వ్యవస్థను కూడా వీరు పరిశీలించారు.

స్వచ్ఛ ఆహార ఉత్పత్తిదారుల సంఘంలో..

అక్కడ్నుంచి రూరల్ మండల గ్రామం నందివెలుగులోని స్వచ్ఛ ఆహార ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించారు. సమగ్ర వ్యవసాయ విధానంలో వివిధ రకాల పంటలను పండిస్తున్న రైతు మీసాల రామకృష్ణను కలిసి, ఆయన అనుభవాలను తెలుసుకున్నారు. కొల్లిపర మండలంలోని అత్తోట చేరుకుని, ప్రకృతి రైతు నామని రోశయ్య బహుళ పంటల క్షేత్రాన్ని సందర్శించారు. అదే గ్రామంలో గల 'భూమి భారతి' కేంద్రంలోని వందలాది రకాల దేశవాళీ వరి విత్తనాలపై ఆరా తీశారు. అక్కడ జరుగుతున్న వరి ధాన్యం ప్రాసెసింగ్‌ను, మార్కెటింగ్ విధానాలపై భూమి భారతి నిర్వాహకుడు యర్రు బాపారావు, ఇతర రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రకృతి విధానంలో వినియోగించే వివిధ రకాల కషాయాల తయారీని చూశారు. రైతు సాధికార కేంద్రం డీడీఏ డి.వెంకటేశ్వర్లు, ఏడీఏ శ్రీనివాస్, ఏఓ శివప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

- రవాణా శాఖ గుంటూరు జిల్లా ఉప కమిషనర్ సీతారామిరెడ్డి
- ఘనంగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు



ఉత్తమ డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న డీటీసీ సీతారామిరెడ్డి, లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: ప్రయాణికులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్యమవుతుందని రవాణా శాఖ గుంటూరు జిల్లా ఉప కమిషనర్ కే సీతారామిరెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపరాదని, రాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలను చేయకూడదని చెప్పారు. ముఖ్యంగా విద్యా సంస్థలలో పనిచేసే డ్రైవర్లు మరింత అప్రమత్తతో పాటు పరిమితికి మించి విద్యార్థులను బస్సు లోపలికి అనుమతించ రాదని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ గానీ, అధిక వేగంతో బస్సులను నడుపరాదని డ్రైవర్లను హెచ్చరించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డ్రైవర్లందరూ మెడికల్ చెకప్ చేయించుకోవాలని కోరారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ కూడా రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశంతో డ్రైవర్లకు అవగాహన కల్పించే విధంగా భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు విద్యార్థులను ఎక్కడం, దిగడానికి అనుమతించుకూడదన్నారు. ప్రతి ఒక్క డ్రైవర్ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమంగా డ్రైవింగ్ చేస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీ డ్రైవర్లను సన్మానించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు టి.రాఘవరావు, మధుసూదన్‌రావు, చేబ్రోలు ఎస్‌ఐ డీవీ కృష్ణ, ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

మంగళగిరి(తాడేపల్లి రూరల్): రహదారి భద్రతా నిబంధనలను పాటించి ప్రమాదాలు నివారించాలని గుంటూరు ఆర్టీఓ సత్యనారాయణ ప్రసాద్ సూచించారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో బుధవారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి ''మోటర్ వాహనాల తనిఖీ కార్యాలయం'' ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులతో కలసి అధికారులు గౌతమ బుద్ధ రోడ్డులో వాక్ మారథాన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి నార్త్‌జోన్ డీఎస్పీ సిహెచ్.మురళీకృష్ణ, మోటారు వాహన తనిఖీ అధికారులు పవన్‌కుమార్, బాలకృష్ణ, అనిల్‌కుమార్, మంగళగిరి పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్, ఎస్‌ఐ హరిబాబు పాల్గొన్నారు.

మహానేత విగ్రహం చేతివేళ్లు ధ్వంసం

చుండూరు మండలం ముస్సంగివారిపాలెంలో ఘటన



మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం చేతి వేళ్లను ధ్వంసం చేసిన దుండగులు

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని ముస్సంగి వారి పాలెం గ్రామంలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మంగళ వారం రాత్రి ధ్వంసం చేశారు. విగ్రహం చేతివేళ్లు తెగ్గొట్టిన దుండగులు సమీపంలోని వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చించివేశారు. మహానేత విగ్రహం చేతివేళ్ల ధ్వంసం చేసి, వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చించివేసిన దుండగలను సత్వరమే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులను డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

పిడుగురాళ్ల: యరపతినేని లక్ష్మయ్య స్మారక రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జీపీ రెడ్డి గ్రూప్ స్కాలర్స్ డిగ్రీ కళాశాలలో ఈ పోటీలను వైద్యుడు వున్నం నాగమల్లీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ప్రారంభించడం శుభపరిణామమన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.60వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్కాలర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్‌రావు, వడ్డపల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పాండురంగా శ్రీనివాసరావు, కామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య

పెదకూరపాడు: అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దకూరపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మిట్ట ప్రాంతానికి చెందిన దర్శి సురేష్ (37) గత ఐదు సంవత్సరాల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. నష్టాలు రావడంతో సొంతగా ట్రాక్టర్ కొనుగోలు చేసి వ్యవసాయ కూలి పనులకు వెళుతున్నాడు. ఆదాయం రాకపోవడంతో ట్రాక్టర్‌కు సంబంధించి ఈఎంఐ కట్టలేక, మరోవైపు కుటుంబ కలహాలతో మనస్థాపనకి గురై ఇంట్లో ఎవరితో చెప్పకుండా ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సురేష్ పెదకూరపాడులోని పొట్ట చెట్టు సమీపంలో పురుగుల మందు తాగి విగతజీవిగా పడి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు పెదకూరపాడు పోలీసులకు సమాచారం అందించారు.

వలసలు నివారించి ఉపాధి కల్పించాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



జేసీ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

బాపట్ల: వలసలు నివారించి నివాస ప్రాంతంలో ఉపాధి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తెలిపారు. వలసలు నివారించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిసిన నేపథ్యంలో ఉపాధి లేక కూలీలు వలసలు వెళుతున్నారని తెలిపారు. మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికీ 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.700 కూలీ చెల్లించాలన్నారు. సొంత ఊరిలో పనులు లేక జిల్లాలోని చాలా గ్రామాల్లో కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వెళుతున్న పరిస్థితులు స్వయంగా చూశామన్నారు. వలసలకు వెళ్లటం వలన పిల్లలు విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. సొంత గ్రామంలోనే ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లాలోని అద్దంకి, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల్లో అధికంగా వ్యవసాయ కూలీలు వలసలు వెళుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు సొంత గ్రామాల్లోనే పని కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పథకం పూర్తిస్థాయిలో అమలు కావటం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

జె. పంగులూరు: అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తిని పోలీసులు మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామంలో మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అద్దంకి సీఐ భవాని తెలిపారు. తూర్పు తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మేడ యలమంద అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని, వెంటనే అతన్ని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా నిందితుడు అక్రమ మద్యం కేసులో ఇప్పటికే మూడు సార్లు అరెస్టయి.. బెయిల్‌పై వచ్చి మళ్లీ అక్రమ మద్యం దందా కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నాటుసారా స్వాధీనం..

నిజాంపట్నం: మహిళ నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని అదవల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మార్టురి శ్రీరామ్‌ప్రసాద్ వివరాల మేరకు దిండి పంచాయతీ అదవల గ్రామంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించగా పాలరేవు బ్రిడ్జి సమీపంలో ఒక మహిళ 5 లీటర్ల క్యాన్‌తో అనుమానస్పదంగా సంచరిస్తోందన్నారు. తమ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా క్యాన్‌లో నాటుసారా ఉందన్నారు. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.

మార్టూరులో సినీ ఫక్కీలో చోరీ

కారు అద్దం పగలగొట్టి రూ.1.20లక్షలతో ఉడాయింపు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో రహదారిపై నిలిపి ఉంచిన కారు అద్దం పగలగొట్టి అందులో ఉన్న రూ.1.20 లక్షల నగదును చోరీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బల్లికురవ మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన గ్రానైట్ వ్యాపారి మాలపాటి పోతురాజు తన బంధువు ఒకరికి అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం కారులో మార్టూరు తీసుకొని వచ్చాడు. పోతురాజు తన కారును సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో సర్వీస్ రోడ్డులో నిలిపి తన చేతిలో ఉన్న నగదు బ్యాగును కారు డ్రైవింగ్ సీటు పక్కన గల ఎడమ వైపు సీటులో ఉంచి రోగిని తీసుకొని సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కారు ఎడమవైపు డోరు దగ్గర ఆగి చాకచక్యంగా కారు డోరు అద్దం పగులగొట్టి ముందు సీటులో ఉన్న నగదు బ్యాగ్‌ను తీసుకొని పారిపోయారు. రెప్పపాటులో జరిగిన చోరీని గమనించిన స్థానికులు కేకలు వేసే లోపే నిందితులు పారిపోయారు. ఆసుపత్రి నుంచి వెనక్కు వచ్చిన పోతురాజు కారులో నగదు బ్యాగ్ కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ సీఐ కె.వెంకట్రావు ఘటనాస్థలికి చేరుకొని చోరీ జరిగిన తీరును గురించి స్థానికులను, పోతురాజును అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్



మిశ్రమ దాణా ప్యాకెట్లు అందిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ షనీలా, జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్

చీరాల టౌన్: రైతులకు వ్యవసాయం, పశుపోషణ రెండు కళ్ల వంటివని.. పాడి పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య పరీక్షలు, పోషకాహారాన్ని అందించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.వేణుగోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని కావూరివారిపాలెంలో పశువైద్య శిబిరాన్ని డిప్యూటీ డైరెక్టర్, ప్రత్యేకాధికారి డాక్టర్ షనీలా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 31 వరకు అన్ని పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పశువులు, దూడలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అన్ని రకాల మందులు, టీకాలు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారన్నారు. పశువులకు విధిగా చూడి పరీక్షలు, నట్టల నివారణ మందులు, లివర్ టానిక్‌లు అందించాలన్నారు. అనంతరం ఖనిజ లవణాల మిశ్రమ దాణా, పోషక ఆహారప్యాకెట్లు అందించారు. ఒంగోలు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ చిట్టిబాబు, పశువైద్యులు పావని, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రజలకు నిరంతరం అవసరమయ్యే ఇసుకను వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా ఇసుక కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇసుక తవ్వకాల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు 15 రోజుల్లో తనిఖీ చేసి ఆమోదం కోసం జిల్లా స్థాయి ఇసుక కమిటీకి ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో పది ఇసుక పట్టా భూముల్లో, 4.93 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాల కోసం చేసుకున్న దరఖాస్తులను కమిటీలో ఆమోదించినట్లు వెల్లడించారు. వీటికి సంబంధించి పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే తవ్వకాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా మరో 70 ఎకరాల్లో ఇసుక తవ్వకాల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి వెంకటసాయి, రవాణా శాఖ జిల్లా ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి, డీపీఓ బి.ఎస్.ఎస్.సాయికుమార్ పాల్గొన్నారు.

గ్రామీణ ఎస్సీ మహిళలకు సబ్సిడీ రుణాలు

నెహ్రూనగర్: గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ మహిళలకు ప్రధాన మంత్రి అనుసచిత్ జాతీ అభ్యుదయ యోజన(పీఎం అజయ్) కింద సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 82 యూనిట్లు చొప్పున రూ.1.64 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న డ్వాక్రాలోని ఎస్సీ మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నామన్నారు. ఈ పథకం కింద రూ.50 వేల రాయితీతో వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకుందేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.